



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖమంత్రి కె.శ్రీనివాస్

పాతవే..కొత్తగా..!





- మూడు క్లస్టర్ల ప్రకటన
- ప్రకటనలకే పరిశ్రమలు పరిమితం
- దశాబ్ధకాలంలో ఏర్పాటైనది కియా ఒక్కటే..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు కోసమని క్లస్టర ఏర్పాటుకు కసరత్తు చేసింది. ఇందులో పాత వాటినే కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతోంది. ఇందులో చిలమత్తూరు, లేపాక్షి మధ్యలో ప్రకటించింది. 8844 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ఇందుకు సంబంధించి ఇదివరకే లేపాక్షి నాలెడ్జి హబ్ పేరుతో 2008లోనే భూములను సేకరించారు. దాన్ని ఒక సంస్థకు కట్టబెట్టారు. ఆ సంస్థ పరిశ్రమ ఏర్పాటు చేయకుండా బ్యాంకు రుణం పొందింది. అవినీతి ఆరోపణల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంటు సంస్థ ఈ స్థలాలను జప్తు కూడా చేసింది. ఈ నేపథ్యంలో ఈ భూమిలో కొత్త క్లస్టర్ ఏర్పాటు ద్వారా న్యాయపరమైన సమస్యలను ఏ రకంగా అధిగమించడం సాధ్యమన్నది చూడాల్సి ఉంది. ఇక మరో క్లస్టర్ మడకశిర వద్ద అని ప్రకటించింది. ఇది కూడా ఇది వరకే పరిశ్రమల కోసం సేకరించి వెయ్యి ఎకరాల భూమి ఉంది. 2012లోనే పరిశ్రమల కోసమని సేకరించారు. ఇంకా కొద్ది మందికి పరిహారం అందలేదు. దీనిపై రైతులు అప్పుడప్పుడు పోరాటాలు సాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఈ భూముల్లో కొత్త పారిశ్రామిక క్లస్టర్‌గా ప్రకటించారు. ఇక్కడ ఎటువంటి పరిశ్రమలు వస్తాయన్నది చూడాల్సి ఉంది. ఇక అనంతపురం జిల్లాలో తిమ్మసముద్రం వద్ద పారిశ్రామిక క్లస్టర్ అని ప్రచారం నడుస్తోంది. ఇక్కడ కూడా పది సంవత్సరాల క్రితమే భూసేకరణ జరిగింది. ఇంత వరకు రాలేదు. ఇలా జిల్లాలో పెద్దఎత్తున భూసేకరణ ఇది వరకే జరిగి ఉన్నాయి. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఏయే పరిశ్రమలు వస్తాయన్నది చూడాల్సి ఉంది.

ప్రకటనలతోనే ముగిసిన పరిశ్రమలు

జిల్లాలో పరిశ్రమలు పెద్దఎత్తున ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రభుత్వాల ప్రకటనలు వెలువడుతూనే ఉన్నాయి. ఇందులో కొన్ని కార్యరూపం దాల్చకుండానే వెనుదిరిగిపోయాయి. ఇందులో డీ.హీరేహాల్ మండలం నేమకల్లు వద్ద కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ. కుదురేముఖ్, ఎపిఎండిసి, రాష్ట్రీ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ మూడు సంయుక్తంగా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని 2012లో ఒప్పందం కూడా చేసుకున్నాయి. ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. దీనికి ప్రధాన కారణం ఓబుళాపురం వద్దన్ను ఇనుప గనులను ఆ సంస్థలకు కేటాయించక పోవడంతోనే ముందుకు సాగలేదన్న విమర్శ ఉంది. జాకీ పరిశ్రమ 2018లో రాప్తాడు వద్ద ప్రకటించారు నిర్మాణపు పనులు కూడా ఏర్పాటు చేశారు. మధ్యలో ఆ పరిశ్రమ ఏర్పాటు జరగకుండానే వెనుదిరిగింది. దీనికి రాజకీయపరమైన కారణాలున్నయన్న ఆరోపణలున్నాయి. ఇవి కాకుండా కనగానపల్లి మండలం దాదులూరు వద్ద ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఒక ప్రయివేటు సంస్థ ముందుకొచ్చినట్టు సమాచారం. ఆ పరిశ్రమ కూడా రాకుండానే మరో ప్రాంతానికి వెళ్లినట్టు సమాచారం. ఇలా అనేక పరిశ్రమలు కార్యరూపం దాల్చకుండానే వెనుదిరిగిపోతున్నాయి. గడిచిన దశబ్దకాలంలో జిల్లాలో ఏర్పాటైన పెద్ద పరిశ్రమ ఏదైనా ఉందంటే అది కియా ఒక్కటే కావడం గమనార్హం.



జిల్లా ఉత్పత్తుల శ్రేణిని విస్తరించాలి

- రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖమంత్రి కె.శ్రీనివాస్
- పారిశ్రామిక రంగంలో ఉమ్మడి అనంత ముందడుగు
- రాష్ట్ర బీసీ, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

ఒకే జిల్లా-ఒక ఉత్పత్తి' కార్యక్రమం కింద ఉత్పత్తుల శ్రేణిని విస్తరిస్తూ, రాష్ట్రంలో సమద్ధిగా ఉన్న వ్యవసాయ అనుబంధ ముడిసరుకు వనరులను ఉపయోగించుకోవాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖమంత్రి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలోని భువన విజయం సమావేశ మందిరంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంఎస్ఎంఈ, సెర్ప్ అంశాలపై సంబంధిత అధికారులు, పారిశ్రామికవేత్తలతో అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్ రెడ్డి, ఏపీ ఐసీసీ పుట్టపర్తి జోన్ జిల్లా అధికారి సోనీ సహాని, అనంతపురం జిల్లా జిఎం శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి కల్పనలో రాష్ట్రంలోని సూక్ష్మ మధ్య చిన్న తరహా పరిశ్రమలు మంచి ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. పెట్టుబడి ట్రాకర్, సింగిల్ డెస్క్, పిఎంఈ జిపి, రాష్ట్ర ఎగుమతుల పోర్టల్‌లతో సహా పరిశ్రమల కోసం వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పరిశ్రమల స్థాపనకు పెద్ద ఎత్తున ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో అధికార వికేంద్రీకరణ, అభివద్ధి వికేంద్రీకరణ జరగాలనే ఉద్దేశంతో 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కులు పెడుతున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అపారమైన చేనేత కార్మికుల ఉన్నారని, వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, పరిశ్రమల స్థాపనకు ముందు వచ్చే వారికి ప్రభుత్వం ప్రోత్సహకాలు అందిస్తామన్నారు. ఎస్‌హెచ్‌జి మహిళలను ఆర్థికంగా అభివద్ధి చేయడానికి విస్తతంగా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ అయిదేళ్లలో వైసీపీ చేయని అభివృద్ధిని కేవలం 5 నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వం చేసి చూపిందన్నారు. చంద్రబాబు అంటేనే బ్రాండ్ అని, ఇందుకు రాష్ట్రానికి తరలొస్తున్న వేల కోట్ల రూపాయల పెట్టుబడులే నిదర్శమన్నారు. 2019లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపు ఆలోచనతో కియా పరిశ్రమలు తీసుకొచ్చి, ప్రపంచ పటంలో పెనుకొండ ప్రాంతాన్ని చూపారని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీవో ఆనంద్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఎల్‌డిఎం రమణ కుమార్, డిక్కీ ప్రతినిధి వెంకటరమణ, వివిధ బ్యాంక్ అధికారులు, ఉమ్మడి జిల్లాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



చిలమత్తూరులో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిలపక్షం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో అదనపు విద్యుత్ ఛార్జీలకు సంబంధించిన బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాట తప్పి అధికారం చేపట్టిన 6 నెలల్లోనే ప్రజలపై అదనపు విద్యు త్ ఛార్జీలను మోపిందని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు హరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ నిస్సార్‌అహ్మద్, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, పెయింటర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, సిపిఎం నాయకులు బాషా, నరసింహులు, ఆరిఫ్, ఆటో యూనియన్ నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ లో సిపిఎం ఆధ్వర్యంలో రైతులు విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ మేరకు సిపియం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తక్షణమే ట్రూ అప్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, నాయకులు రామచంద్ర, నాగరాజు, రహమంతుల్లా, అశ్వర్థరెడ్డి, రజీయాబాను, సావిత్రమ్మ, మాబుజాన్ పాల్గొన్నారు.

ఎంపిఇఒలకు ఉద్యోగ భద్రత కల్పిస్తాం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ప్రజాశక్తి-మడకశిర

ఎంపిఇఒలకు ఉద్యోగ భద్రత కల్పించడానికి తమ వంతుగా కృషి చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. వ్యవసాయ శాఖలో పని చేసిన ఎంపిఇఒలు సోమవారం వారిని కలిసి తమను ఓడి బేస్ మీద ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాకు తిరిగి తీసుకురావాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిఇఒల సంఘం రాష్ట్ర కోశాధికారి పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి అశోక్, జిల్లా నాయకులు మోహన్, ప్రశాంత్, దిల్షాద్, జ్యోతి, చైత్ర, ప్రశాంత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి, లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై సచివాలయ ఉద్యోగులు, సర్పంచులు, వీఆర్వోలు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామ్‌కుమార్, ఈఓఆర్‌డి గోవిందప్ప, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ, ఆర్‌డబ్ల్యుఎస్ అసిస్టెంట్ ఇంజినీర్ సూర్యకుమార్, వెలుగు ఎపిఎం విశ్వనాథ్, మెడికల్ హెల్త్ సూపర్వైజర్ గిరినాథరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

గుడిబండ : సుస్థిర సాధనలో అందరూ భాగస్వాములు కావాలని, పేదరిక నిర్మూలనకు కలిసికట్టుగా పని చేయాలని ఎంపిడిఒ గంగాధర్ అన్ని శాఖ అధికారులకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, ఐసిడిఎస్, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు. ఎంపిడిఒ గంగాధర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో పేదరి కాన్ని నిర్మూలించాలని, ఆహార భద్రత కల్పించాలని, మహిళా సాధికారిక, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ రవిచంద్ర కుమార్, డిప్యూటీ తహశీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కమలమ్మ, ఈఓఆర్డి నాగరాజునాయక్ అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన సచివాలయ ఉద్యోగులు, సర్పంచులు, వీఆర్వోలు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

టిడిపితోనే రైతుల సంక్షేమం, అభివృద్ధి : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

రైతుల సంక్షేమం, అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని మంత్రి సవిత తెలిపారు. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో నియోజక వర్గ వ్యాప్తంగా కూటమి మద్దతుదారులు అన్ని సంఘాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. నూన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, టిసి మెంబర్లు సోమ వారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే సిఎం చంద్రబాబు ఆశయమ న్నారు. ఆ ఆశయం మేరకు సాగు నీటి సంఘాల పాలకవర్గం రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.



మంత్రి సవితకు పూలబొకే ఇస్తున్న సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు

వైసిపి ఎంపిటిసి టిడిపిలో చేరిక

గోరంట్ల మండలంలోని బూదిలి పంచాయతీకి చెందిన వైసిపి ఎంపిటిసి మంజు మంత్రి సవిత సమక్షంలో టిడిపిలో చేరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంత్రి టిడిపి కండువా వేసి మంజును సాదరంగా ఆహ్వానించారు.

చేనేత మహిళలకు ఉపాధి కల్పించండి

ఎంఎస్ఎంఇ మంత్రి కె.శ్రీనివాస్‌కు పరిటాల శ్రీరామ్ వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

ధర్మవరంలో మహిళా ఇండస్ట్రియల్ పార్క్, స్టిచ్చింగ్ యూనిట్ పరిశ్రమ ఏర్పాటు చేసి ఆర్థికంగా చితికిపోయిన చేనేత కుటుంబాల మహిళలకు ఉపాధి కల్పించాలని కోరుతూ సోమవారం ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితతో కలిసి మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఇ) మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు విన్నవించారు. జిల్లా పర్యటనలో భాగంగా పెనుకొండకు వచ్చిన మంత్రి శ్రీనివాస్‌ను పరిటాల శ్రీరామ్ కలిసి ధర్మవరం ప్రాంతంలో చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ధర్మవరం చేనేత రంగం కొన్నేళ్లుగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. ముడిసరుకు ధరలు పెరిగి గిట్టుబాటు ధర లేక కుదేలైందన్నారు. ఒక్క ధర్మవరంలోనే 50వేల కుటుంబాలు ఆర్థికం గా దెబ్బతిన్నాయన్నారు. చేనేత వృత్తిలో కీలకంగా ఉన్న 20వేల మందికి పైగా మహిళలకు ప్రస్తుతం ఉపాధి లేకుండా పోయిందని, వారికి ఉపాధి చూపించాలని కోరారు. మహిళా ఇండస్ట్రియల్ పార్క్, స్టిచ్చింగ్ యూనిట్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి శ్రీనివాస్ ఈ ప్రాంత మహిళలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళలు, చేనేత కార్మికుల సమస్యలపై సిఎం చంద్రబాబుతో చర్చిస్తానని మంత్రి తెలిపారు.



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇస్తున్న పరిటాల శ్రీరామ్, మంత్రి సవిత

ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు



కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సవిత

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని బీదానపల్లి గ్రామంలో సోమవారం కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి సవిత హాజరై కురుబ సామాజిక వర్గం మహిళలతో కలిసి జ్యోతులు మోశారు. అనంతరం కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు మంత్రికి కంబాలపల్లి సర్పంచి మంజు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, చిన్నప్పయ్య, నాయకులు అశ్వర్థనారాయణ, ఎంపిటిసి రమేష్, రాగిమేకలపల్లి బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు తన తండ్రి రామచంద్రారెడ్డి గారి జ్ఞాపకార్థం భక్త కనకదాసు విగ్రహాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు.

ప్రమాద బాధితునికి మంత్రి ఆర్థిక సాయం

రొద్దం : మండలంలోని ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త శ్రీరామప్ప రెండు నెలల క్రితం ఓ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాడు. అతడు ఇంటికే పరిమితం కావడంతో మంత్రి సవిత ఆ గ్రామం వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, నాగభూషణ, అశ్వర్థనారాయణ, వెంకారెడ్డి, డీలర్ల సంఘ అధ్యక్షులు సిద్దన్న, కదిరన్న, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి కాపాడండి

తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఆక్రమణల నుంచి వంకను కాపాడాలని కోరుతూ సోమవారం స్థానిక షిరిడీనగర్ వాసులు తహశీల్దార్ రెడ్డి శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ స్థానిక అక్కమ్మ కొండ నుంచి వచ్చే వర్షం నీరు వంక ద్వారా ఆముదాలకుంటకు నీరు వెళ్తాయని, అక్కడి నుంచి పెను కొండ అటవీ ప్రాంతంలోకి నీరు వెళ్లేదన్నారు. అయితే కొందరు వంకను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడంతో వంకలో వెళ్లాల్సిన నీరు పక్కనే ఉన్న షిరిడీనగర్‌లో రోడ్లు, వీధుల్లోకి చేరడంతో బురదమయం అవుతున్నాయ న్నారు. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇకనైనా జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి వంకను పరిరక్షించి, ఈ సమస్య ను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు కొల్లప్ప, ప్రధాన కార్యదర్శి కాశీం, చేలూరి గంగాధర్, సుమిత్ర, విజయలక్ష్మి, శ్రీకాంత్, వెంకటేష్, రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బైక్ రైడర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

రోడ్లపై విచ్చలవిడిగా బైక్ రైడ్ చేస్తూ వాహనదారులు, బాటసారులకు ఇబ్బందులు కలిగించడంతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్న పలువురు యువకులను సోమవారం ఎస్ఐ రమేష్‌బాబు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ హిందూపురం పట్టణానికి చెందిన యువకులు రోడ్లపై బైక్ రైడింగ్ చేస్తుండగా పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిచే రూ. 1,150 చలానా కట్టించారు. అలాగే బైక్ రైడ్ వల్ల జరిగే ప్రమాదాలు, రోడ్డు నిబంధనలపై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై రైడర్లు ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదని, జాగ్రత్తలు పాటించాలని, లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజల నుంచి వచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించి ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని అధికారులను కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ 210 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయసారధి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ఎస్‌బిఐ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత నిస్తోందని దీనిపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సమస్యలను పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఆయా శాఖ లక్ష్యసాధనలో భాగంగా కిందిస్థాయి ఉద్యోగులు వారి పని తీరును మెరుగుపరుచుకునే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పదేపదే సమస్యలపై మండలం నుంచి కలెక్టరేట్‌కు వస్తే దానిపై కింది స్థాయి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి వైవి.సుబ్బారావు, ఉద్యానవన శాఖ చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమాధికారి శివ రంగ ప్రసాద్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ పాల్గొన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ శాఖ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు పై ఈనెల 14 నుంచి 25 వరకు జరుగుతున్న అవగాహన వారోత్సవాలలో భాగంగా ఇంధన పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికలు, ఫ్లెక్సీలు, కరపత్రాల ప్రచార సామాగ్రిని జిల్లా కలెక్టర్ చేతన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ సారధి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ.సురేంద్రబాబు, ఈఈ శివరాం, ఏఈ సాయినాథ్ పాల్గొన్నారు.

కల్లు దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న కల్లు దుకాణాలను సోమవారం విజిలెన్స్ సిఐ అలీబేగ్, ఎక్సైజ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య వేర్వురుగా తనిఖీ చేశారు. పరీక్షల కోసం వారు కల్లు శాంపిల్స్ తీసుకెళ్లారు. వారు మాట్లాడుతూ మండలంలో కల్తీ కల్లు, రసాయనాలు, మత్తు పదార్తాలు కలిపిన కల్లు విక్రయిస్తేత దుకాణాల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్న వారు మాత్రమే దుకాణం నిర్వహించాలన్నారు. కల్లు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపుతామని అందులో రసాయనాలు, మందులు వాడినాట్లు తేలితే చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో విజిలెన్స్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భక్తరహళ్లి భూతప్ప ఉత్సవాలు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని భక్తరహళ్లి జిల్లేడుగుంట ఉమ్మడి ఆలయాలకు సంబంధించి జరుగుతున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భూతప్ప ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భూతప్పల స్పర్శ తగిలతే కోర్కెలు, సమస్యలు తీరతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో భక్తులు నీటిలో మునిగి తడి దుస్తులతోనే భూతప్ప ఉత్సవంలో పాల్గొంటారు. చాలా మంది భక్తులు సంతానం, దీర్ఘకాలిక రోగాల నుంచి విముక్తి కోసం భూతప్ప ఉత్సవంలో పాల్గొంటారు. ఈ ఉత్సవాలకు అనంత పురం, బెంగళూరు, తుమకూరు ప్రాంతాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భూతప్ప స్పర్శ కోసం నేలపై పడుకున్న భక్తులు

ప్రభుత్వ భూములను కాపాడండి

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో జాతీయ రహదారికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో వారపుసంత నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు సోమవారం జిల్లాకేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ వారపు సంత నిర్వహించడానికి సరైన స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి వారపు సంత నిర్వహించడానికి ఆ ప్రభుత్వ భూమిని కేటాయించి ప్రమాదాలు నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సోంపాల్యం నాగభూషణ, మల్లికార్జున, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని యాకర్లకుంటపల్లి గ్రామంలో ఉచిత పశు గర్భకోశ చికిత్సా శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా పశుగణాభివద్ధి సంస్థ కార్య నిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ పశువులను పరీక్షించారు. పశు పోషణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టివి.సుధాకర్, డాక్టర్ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నృత్య పోటీలకు ఓడీసీ విద్యార్థులు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

జాతీయస్థాయి డాన్స్ పోటీలకు మండల కేంద్రంలోని జ్ఞాన సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు.ఏపీ డాన్స్ స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కదిరి వాల్మీకి పాఠశాలలో రాష్ట్ర స్థాయి సెలక్షన్స్ ఆదివారం జరిగాయన్నారు. ఈ సెలక్షన్లో జ్ఞాన సాయి పాఠశాలకు చెందిన విద్యార్థులు 12 మంది విద్యార్థిని విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. డాన్స్ అంటే గతంలో కేవలం వినోదాత్మకమని ఇప్పుడు అది ఒలంపిక్ గేమ్స్ లో ఉందని చెప్పారు.

పేదలకు వైద్యసేవలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పేదల ఆరోగ్యమే రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, క్యాంపు చైర్మన్ రమేష్ బాబు తెలిపారు. ఈనెల 22న రోటరీ క్లబ్ ఇన్నర్ వి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం పట్టణంలోని సాంస్కృతిక మండలిలో విడుదల చేశారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణకాంత్ రెడ్డి, డాక్టర్ సింధు, డాక్టర్ లోకనాథ్ ,డాక్టర్ దివాకర్, డాక్టర్ పద్మ, డాక్టర్ తేజస్విని డాక్టర్ కిషోర్ డాక్టర్ దినేష్ వైద్యచికిత్సలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సుదర్శన్ గుప్త, రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్ హంపయ్య, గట్టు హరినాథ్, కొండయ్య, తిరుమల దాస్, నాగరత్న, నరేందర్ రెడ్డి, సత్రశాల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా రగ్బీ పోటీలకు ధర్మవరం విద్యార్థి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

అల్ ఇండియా రగ్బీ పోటీలకు ధర్మవరం పట్టణంలోని కెహెచ్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలకు చెందిన టి.పోతిరెడ్డి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గత నెల 10వ తేదీన ఎస్కే యూనివర్సిటీ నిర్వహించిన సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోతిరెడ్డి ఎస్కే యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన ఈ విద్యార్థి చండీఘర్‌లో ఈ నెల 17వ తేదీ నుండి ప్రారంభమయ్యేటువంటి అల్ ఇండియా రగ్బీ పోటీలకు ఎస్కే యూనివర్సిటీ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థి టి. పోతిరెడ్డిని కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ బి.ఆనంద్, తదితర ఆధ్యాపకులు, తదితరులు అభినందించారు.

విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగుపరుస్తాం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగు పరుస్తామని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు సంకల్ప-2025 లో భాగంగా కళాశాలలోని విద్యార్థులను వారి యొక్క ప్రతిభ ఆధారంగా ఎ,బి,సి కేటగిరీలుగా గ్రూపులు చేయడం జరిగిందని తెలిపారు. బి, సి గ్రూపులో గల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం జరిగిందన్నారు. ఈ స్టడీ మెటీరియల్ వల్ల విద్యార్థులు మరింత మంచి మార్కులతో ఉత్తీర్ణతను సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం వంటి వెనుకబడిన జిల్లాల్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి చెరువుల అన్నింటినీ నీటితో నింపాలని రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ వెంకటేశు కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ శ్యామ్ కిరణ్, ఆర్ఎస్‌పి ఏ.శ్రీనివాసులు, కేశవ, ఎంఐఎం మున్నా, ఏపీఆర్ఎస్ నౌషాద్, బిఎస్‌పి హరి తదితరులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అమరావతి, పోలవరం తప్ప ఇంకేవీ పట్టలేదన్నారు. ప్రధానమైన రాయలసీమ వెనకబడిన ప్రాంతాల ప్రాజెక్టుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో

ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లు విడుదల

ప్రజాశక్తి- చిలమత్తూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించే ఎస్-ఎస్‌సి మోడల్ పేపర్ల మెటీరియల్‌ను సోమవారం స్థానిక దేమకేతేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద ఆవిష్కరించారు. ఈ మేరకు యూటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల శ్రేయస్సుకు కూడా పాటుపడుతుందన్నారు. తక్కువ ధరకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల కు అన్ని సబ్జెక్టులు ఉండే విధంగా 100 రోజుల ప్రణాళికకు అనుకూలంగా తయారు చేసి అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు లక్ష్మీపతి, పి.శ్రీనివాసులు, వి.శ్రీనివాసులు, సురేష్ కుమార్, జగదీష్, శంకర నారాయణ, ఆంజనేయులు, ముత్యాలప్ప, చిత్ర, దేమకేతేపల్లి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మోడల్ పేపర్లు విడుదల చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

విఓఎ అధ్యక్ష ఎన్నికలు రద్దు చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి ప్రశాంతి గ్రామ్ వద్ద అక్రమంగా నిర్వహించిన విఓఎ అధ్యక్ష ఎన్నికలు రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తచెరువు మండలం కేంద్రంలో ఉన్న బిసి కాలనీలో ప్రశాంతి గ్రామైక్య సంఘం ఎన్నిక జరగకుండానే ఇంటింటి దగ్గరికి వెళ్లి అధ్యక్ష్యులను ఎంపిక చేశారని విమర్శించారు. కేవలం 27 సంఘాల లీడర్లతో ప్రభుత్వ పథకాల కోసమని, ఇన్సూరెన్స్ అని సభ్యులకు కూడా సమాచారం ఇవ్వకుండా సంతకాలు పెట్టించడం సరైంది కాదన్నారు. ఈవిషయంలో సీసీ సదాశివ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని అన్నారు. అక్రమంగా జరిగిన ఈఎన్నికను రద్దు పరిచి ఉన్నత స్థాయి అధికారుల సమక్షంలో ఈ ఎన్నిక జరగాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు నాగమణితో పాటు సిపిఎం నాయకులు బ్యాళ్ల అంజి, సిద్దు, సాకే వెంకటేష్, ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షులు గంగలప్ప, సురేష్, ముత్యాలమ్మ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, అశ్విని, తులసి, లక్ష్మి, అరుణ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

ఎమ్మెల్యే పల్లె సింధూర



అర్జీని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - ఆమడగూరు

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక సమావేశాన్ని నిర్వహించినట్లు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే పుట్టపర్తి నియోజకవర్గంలోని ఒక్కొక్క మండలానికి రూ.3 కోట్ల చొప్పున మొత్తం రూ. 20 కోట్లు రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆమడగూరు మండలంలో గతంలో సైన్స్ సిటీ పేరుతో అప్పటి ప్రభుత్వం సేకరించిన 1100 ఎకరాలలో ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకట సన్యాసి శర్మ, తహశీల్దార్ రామనాథ్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, కూటమి నాయకులు, టిడిపి మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, కృష్ణమూర్తి, కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం , ఐరన్ మంచాలు అందజేత

అమడుగురు సమీపంలోని శ్రీ మాదృశ్రీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆయుర్వేదిక్ డాక్టర్ సిరి ఆధ్వర్యంలో అందించిన 7 ఇనుప మంచాలతోపాటు టిడిపి నాయకుడు రామచంద్రారెడ్డి అందించిన బియ్యం ప్యాకెట్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, ఓడి చెరువు మండల టిడిపి కన్వీనర్ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్మికులపై దురుసు ప్రవర్తన తగదు : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గోరంట్ల మండలం గుంతపల్లి నిషా గార్మెంట్‌లో పనిచేసే మహిళా కార్మికులపై నిషా యాజమాన్యం తన దురుసు ప్రవర్తన మానుకోవాలని వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పుట్టపర్తిలో సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో గార్మెంట్స్ ముందు మహిళా కార్మికులు సోమవారం మూకుమ్మడిగా రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలిపారన్నారు. గార్మెంట్‌లో గత వారం నుంచి మహిళలు వేతనాలు అందక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. దీంతో మహిళలు పనులకు రావాలా వద్దా అని లోలోపల మదన పడుతున్నారని అన్నారు. మహిళా కార్మికులు నిరసనకు దిగితే యాజమాన్యం కేవలం ఐదు రూపాయలు మాత్రమే పెంచుతానని తెలపడం విడ్డూరంగా ఉందని, కనీసం రోజుకు 30 రూపాయలు పెంచాలని లేదా రాను పోను చార్జీలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. మహిళలను కించపరిచి అవమానపరుస్తూ మాట్లాడితే ఫోక్స్ చట్టం కిందకి వస్తుందని అందులో ఎంతటి అధికారినైనా యాజమాన్యంపై నైనా చర్యలు తీసుకోవడానికి యూనియన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సరైనది కాదని కార్మికులను నిరంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మహిళలకు సంబంధించినటువంటి అన్ని సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని సిఐటియుగా డిమాండ్ చేశారు. జిల్లా లేబర్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని మహిళల న్యాయమైన డిమాండ్లకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

కొళాయి అక్రమ కనెక్షన్లపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సి పాలిటీలో ఇబ్బడి, ముబ్బడిగా ఉన్న కొళాయి అక్రమ కనెక్షన్లను గుర్తించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే అధికారికంగా ఉన్న కొళాయి కనెక్షన్ల నుండి లక్షలాది రూపాయల బకాయిలు పేరుకుపోవడంతో వాటిని సైతం వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా తొలుత కొళాయి అక్రమ కనెక్షన్లను గుర్తించి వాటిని తొలగించడంతోపాటు, మొండి బకాయి దారులకు నోటీసులు జారీచేస్తూ వసూలుపై దృష్టి సారించారు. మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఎనిమిది కొళాయి అక్రమ కనెక్షన్లను గుర్తించారు. మున్సిపల్ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆయా ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గుర్తించిన ఎనిమిది కొళాయి కనెక్షన్లను వెంటనే తొలగించారు. మున్సిపాలిటీ అనుమతి లేకుండా కొళాయి కనెక్షన్లు ఉంటే శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అపరాధ రుసుము విధించడం జరుగుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అదే విధంగా పేరుకుపోయిన మొండి బకాయిలను సైతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ జనార్ధన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కొళాయి కనెక్షన్‌ను తొలగిస్తున్న దృశ్యం

ఫీజుతో సంబంధం లేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలి

ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా డిగ్రీ విద్యార్థులకు హాల్‌టికెట్ అందజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డిమాండ్ చేశారు. విద్యార్థులకు హాల్‌టికెట్ ఇచ్చే విషయంలో కళాశాలల యాజమాన్యాల తీరుకు నిరసనగా సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. కళాశాల ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని విద్యార్థులకు యాజమాన్యాలు వేధిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ ను కళాశాల యాజమాన్యాల ఖాతాల్లోకి వేస్తామని జీవో ఇచ్చి ప్రకటించినా విద్యార్థులకు ఫీజులు కట్టమని ఇబ్బందులు గురి చేయడం తగదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాల పైన యూనివర్సిటీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దిలీప్, అజయ్, సురేష్, నరేష్, సాగర్, హరి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి జాతీయ వినియోగదారుల వారోత్సవాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 18 నుంచి 24 వరకు నిర్వహించే వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర వినియోగదారుల సంఘాల ప్రధాన కార్యదర్శి జి. సురేష్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ వారోత్సవాలలో భాగంగా వినియోగదారుల హక్కులు రక్షణ బాధ్యతలపై అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని వీటిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు డిజిటల్ సౌలభ్యం అంశంపై వ్యాసరసన, ముఖాముఖి చర్చా వేదికలు కళాశాలలో పాఠశాలలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.3వేలు, రూ. 2వేలు, రూ. 15వందల ప్రకారం విజేతలకు రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల కలెక్టర్ల కార్యాలయాల్లో కలెక్టర్ల చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. 26 జిల్లాలలోని విజేతలు రాష్ట్రస్థాయి వ్యాసరచన డిబేట్ లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్నివినియోగదారుల సంఘాలు స్థానిక జిల్లా పౌర సరఫరాల శాఖ సమన్వయంతో విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అవగాహన



పరిగిలో సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - గాండ్లపెంట

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులు పాటు నిర్వహించే శిక్షణాతరగతులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని అభివృద్ధి ప్రణాళికతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పాత్రను వివరించారు. ప్రజలకు మౌలిక అవసరాలు, గ్రామాలలో ప్రజలకు ఉపాధి అవకాశాలు సామాజిక దురాచారాలు తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్ కుమార్ రెడ్డి, ఐసిడిఎస్ పద్మావతి. ఈవోఆర్డీ సునీత. పంచాయితీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక మండల ప్రజా పరిషత్తులో కార్యాలయంలో సోమవారం సచివాలయ సిబ్బందికి, గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాయి మనోహర్, ఎఒ అబ్దుల్ నబీ, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిగి :మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో డ్వాక్రా మహిళల పురోగతికి అధికారులు పనిచేయాలని ఎంపీడీవో శ్రీధర్ పిలుపునిచ్చారు. పరిగి ఎంపీడీవో కార్యాలయం నిర్వహించిన అధికారులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, పేదరిక నిర్మూలన తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తలుపుల : జీవనజ్యోతి మండల సమైక్య వెలుగు కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాల సిబ్బంది సర్పంచులకు మండల స్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామానాయక్, ఎంపీపీ మహమ్మద్ రఫీ, డిఎల్‌డిఒ అంజినప్ప, వైద్యులు అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

హత్యకేసు నిందితులు అరెస్టు

వివాహేతర సంబంధమే కారణం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

కొత్తచెరువు మండలం మైలేపల్లి ఫామ్ హౌస్ వద్ద విద్యుత్ కాంట్రాక్టర్ రాజశేఖర్ హత్య కేసు నిందితులను అరెస్టు చేసినటుల పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ హత్యకు ప్రధాన కారణం వివాహేతర సంబంధమేనని తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. సోమవారం పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను డీఎస్పీ విజయ్ కుమార్ వెల్లడించారు. నల్లమాడ మండలం బొగ్గలపల్లికి చెందిన రాజశేఖర్ విద్యుత్ కాంట్రాక్టు పనులు చేస్తూ ఉండేవాడని ఈ క్రమంలో పెనుకొండ మండలం వెంకటగిరి పాలెంలో హోటల్ నిర్వహిస్తున్న రాధమ్మ అనే మహిళతో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసిందని అన్నారు. అప్పటి నుంచి రాజశేఖర్ భార్య పిల్లలకు దూరంగా ఉంటూ రాధమ్మ తోనే ఎక్కువగా గడిపే వాడని తెలిపారు. ఇదే విషయమై రాధమ్మ భర్త రవీంద్రారెడ్డి పలుమార్లు పద్ధతి మార్చుకోవాలని రాజశేఖర్‌ను హెచ్చరించాడన్నారు. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టించినట్లు తెలిపారు. అయినప్పటికీ రాజశేఖర్ తన వైఖరిని మార్చుకోలేదన్నారు. దీంతో రవీంద్రారెడ్డి ఆయన బావమరిది అయిన అనంతపురం ఏపీఎస్పీ 14 బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సాయినాథ్ రెడ్డి , అనిల్ కుమార్ రెడ్డి మరో ఇద్దరితో కలిసి డిసెంబర్ 12వ తేదీన రాజశేఖర్ హత్యకు పథకం రచించారన్నారు. మైలేపల్లి ఫామ్ హౌస్ వద్దకు వెళ్లి రాజశేఖర్‌ను కర్రలు, రాడ్లతో తీవ్రంగా గాయపరిచి వెంకటగిరి పాలెంకు తీసుకెళ్లి హత్య చేసి మృతదేహాన్ని తిరిగి మైలేపల్లి ఫామ్ హౌస్ వద్ద పడేసినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కొత్తచెరువు సిఐ ఇందిరా కేసు నమోదు చేసి సోమవారం రోజున కొత్తచెరువు సమీపంలోని మరకుంటపల్లి సమీపం వద్ద ఆరుగురు నిందితులను అరెస్టు చేసి చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు తెలిపారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

రైలు కిందపడి ఇద్దరు యువతులు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెనుకొండ

గూడ్స్ రైలు కింద పడి ఇద్దరు యువతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మంగాపురం వద్ద చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సంధ్యారాణి మహరాన్(28), బెహరా(22) బెంగళూరులోని ఓ గార్మెంట్ పరిశ్రమలో పని చేసేవారు. వారు ఆదివారం సాయంత్రం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో వచ్చి పెనుకొండ రైల్వే స్టేషన్‌లో దిగారు. రాత్రి 8 గంటల సమయంలో స్టేషన్ సమీపంలోని మంగాపురం గ్రామం వద్ద గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం సమాచారం అందడంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుర్తుతెలియని మహిళ మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని మహిళ (40) రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ తెలిపారు. మృతురాలుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కల్లు దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సంబంధిత అధికారులు కల్లు దుకాణాల లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు స్థానిక ఎక్సైజ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లేపాక్షి, చోళ సముద్రం, చిలమత్తూరు మండలాలలో కల్లు దుకాణాల్లో కల్లు శాంపిల్స్ చిత్తూరు కెమికల్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. పరీక్షల్లో మత్తు పదార్థాలను కలిపినట్లు తేలితే లైసెన్స్ రద్దుతో పాటుగా, పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్ల నరసింహ, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్ల ఆంజనేయులు,సుధాకరెడ్డి, శివ కుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నట్లు సిఐ వివరించారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రం సమీపంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారి నుండి రూ. 8,540 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఇందిరమ్మ కాలనీ శివారులో నార్సింపల్లి చెరువు లో జూదం ఆడుతూన్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి రైడ్ చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అగ్రిమెంటు ఒకరికి... దానవిక్రయం మరొకరికి...

ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఒడిసి మండల పరిధిలోని ఇనగలూరు గ్రామ పంచాయతీలోని భూమిని అగ్రిమెంట్ తమకు చేసి అదే భూమిని మరొకరికి దాన విక్రయం చేశారనికదిరి ప్రాంతానికి చెందిన సుబ్బరాయుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీకి ఆయన ఫిర్యాదు చేశారు. ఒడిసి మండలం ఇనగలూరు గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 11/87 లో 2. 45 ఎకరాల స్థలాన్ని సదాశివరెడ్డి అనే వ్యక్తితో ఎకరం 70 లక్షలతో కదిరికి చెందిన సుబ్బరాయుడు, అగ్రిమెంట్ చేసుకున్నాడు. అందుకు రూ. 10 లక్షలు అడ్వాన్స్‌గా 2023 జూన్ 3న ముట్ట చెప్పినట్లు బాధితుడు తెలిపాడు. భూమిని చదును చేయడానికి ఖర్చు చేశామని, ఆ భూమిని సదాశివరెడ్డి ఇతరులకు దాన విక్రయం చేశారని బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆ భూమిని చదును చేయడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేశానని ఆ డబ్బును కూడా ఇవ్వకుండా తమపై దౌర్జన్యానికి దిగుతున్నాడని వాపోయారు. ఈవిషయంలో తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

మైనర్లతో పనిచేయిస్తే చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా మైనర్లను పనిలో ఉంచుకోవడం, వారితో ఇతర పనులు చేయించుకుంటే నేరమని జిల్లా ఎస్పీ వి. రత్న హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, మహిళా పోలీసులు, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా మోటార్ మెకానిక్ షాపులు, గుజరి షాపులు, కిరాణా షాపుల వద్దకు వెళ్లి 14 సంవత్సరముల లోపు బాలురు పనిచేయుట నేరమని హెచ్చరించారు. గుజిరి షాపుల్లో పనిలో ఉన్న మైనర్లకు విముక్తి కలిగించారు. అదేవిధంగా ధర్మవరం వన్ టౌన్, టూ టౌన్, బత్తలపల్లి, పరిగి, ముదిగుబ్బ, కొత్తచెరువు తదితర మండలాల్లో పోలీస్ అధికారులు, ఐసిడిఎస్, స్వచ్ఛంద సంస్థ సిబ్బందితో కలిసి వెళ్లి ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహించారు.



ఇటుకల బట్టి వద్ద కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

బత్తలపల్లి : బడికి వెళ్లి చదువుకోవాల్సిన వయస్సులో పిల్లలను పనిలో చేర్పించడం నేరమని ఎస్ఐ సోమశేఖర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరితో కలిసి బత్తలపల్లి హోటళ్లు, మెకానిక్‌షెడ్లు, ఇందిరమ్మ కాలనీ, మాల్యవంతం సమీపంలోని ఇటుక బట్టీల్లో ముస్కాన్ ఆపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాల్యావంతం గ్రామం శివారులోని ఇటుకుల బట్టిలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కొన్ని కుటుంబాలు అక్కడ ఉండి వారితో పాటు తమ పిల్లలతో పనులు చేయిస్తున్నాయన్నారు. దీతో ముగ్గురు పిల్లలను బాల కార్మికులు గా గుర్తించి వారిని వారి తల్లితండ్రులతో పాటు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ తిరుపాల్, హెడ్ కానిస్టేబుల్ ఓబిలేష్, పోలీసులు జనార్ధన్, అనిల్, ఆంజనేయులు, మహిళా కానిస్టేబుల్ అశ్వని తదితరులు పాల్గొన్నారు.